# కాలువ వచ్చింది.. మురుగు తొలగింది

- కుమ్మరివాడ వాసుల దశాబ్దాల సమస్య పరిష్కారం



నూతనంగా నిర్మించిన మోరీపై నీళ్లు పోస్తున్న మహిళ

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 19: సమైక్య రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ వీధిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతో అన్ని వసతులు సమకూరుతుండగా, స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరివాడలో దశాబ్దాలుగా కనీసం మురుగు కాలువ లేకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేయగా, స్థానిక కౌన్సిలర్ మక్కపల్లి కుమార్‌యాదవ్ పర్యవేక్షణలో 150 మీటర్ల మేర మురుగు కాలువ నిర్మాణం పూర్తయింది. దీంతో రెండు దశాబ్దాలకు పైగా మురుగు కాలువ లేక తాము పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

### ఇంటి ముందు నీళ్లు నిలిచేవి



20 ఏళ్లకు పైగా మావాడలో మోరిలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇంటి ముందు నీళ్లు నిలిచేవి. తెలంగాణ వచ్చినాక మా కౌన్సిలర్‌ను మోరి కావాలని కోరగానే, ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. మోరీ నిర్మించడంతో మాకు ఇప్పుడు ఎంతో సౌకర్యంగా ఉంది.

*- అన్నపురెడ్డి ప్రమీల, గృహిణి, కుమ్మరివాడ*

### మా బాధ తీరింది



మా వాడకు మురుగు కాలువ లేక, రోడ్డు పక్క నుంచి చిన్న కాలువ తీశారు. అన్ని ఇండ్ల నుంచి మురుగునీరు దాని గుండా పోతుండడంతో మాకు తీవ్రంగా దుర్వాసన వచ్చేది. ఎట్టకేలకు పాత మోరి జాగలనే కొత్తగా సీసీతో కొత్త మోరీ కట్టడంతో కొన్నేళ్లుగా మేం పడుతున్న బాధ తీరింది. ప్రజల బాధలను అర్థం చేసుకొని నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

*- బిజిగిరి శ్రీనివాస్, కుమ్మరివాడ*

# బీజేపీ నాయకుల్లారా ఖబడ్దార్!

- ఉద్యమకారులపై బట్టకాల్చి మీదేస్తామంటే ఊరుకునే ది లేదు.. జాగ్రత్త
- విలేకరుల సమావేశంలో ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన యువజన నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యువజన నాయకుడు కుమార్

జమ్మికుంట, అక్టోబర్19: 'తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిన్నం.. రాష్ట్ర ఏర్పాటు కోసం అహర్నిషలు కష్ట పడ్డం. 20ఏళ్లు పనిచేసినం. ఈటలతో తిరిగినం. ఎన్నో శ్రమలకోడ్చినం. ఒడుదొడుకులెదుర్కొన్నం. మాకేం చేసిండో ఈటలనే చెప్పాలే. బహిరంగ చర్చకు రావాలే. ఉద్యమకారులపై బట్టకాల్చి మీదేస్తామంటే ఊరుకునేది లేదు. జాగ్రత్త. బీజేపీ నాయకుల్లారా మీకేం తెలుసని మాట్లాడుతున్నరు. ఉద్యమంలో మీరెక్కడో చెప్పాలే. ఖబడ్దార్.. అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు..' అని బీజేపీ నుంచి ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన యువజన నాయకులు జవ్వాజీ కుమార్(జేకే), మహ్మద్ జానీ, అఖిల్, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని వినాయక గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. ఈటల రాజేందర్ తమకేం పనిచేయలేదని, వాడుకొని వదిలేశాడని ఆరోపించారు. పార్టీలో, వెంబడి తిరిగినప్పుడు చిన్న, చిన్న పనులు చేసుండచ్చుగాక.. అంతే కానీ, కోట్లిచ్చినట్టు మాట్లాడడం సబబుకాదన్నారు. ఈటల తన పిల్లలకు ఫీజులు కట్టారని ఆరోపించారని, అది నిజమే అయితే నిరూపించాలని జవ్వాజీ కుమార్ డిమాండ్ చేశారు. ఫీజుల విషయంలో అమరవీరుల స్తూపం సాక్షిగా చర్చకు రావాలని, అబద్ధమైతే ముక్కు నేలకు రాయాలన్నారు. ఇరవై ఏళ్లు కుటుంబాలను వదిలి పెట్టి ఉద్యమంలో తిరిగామని, ఇప్పుడు చిల్లర నాయకులతో మాట్లాడించడం సబబు కాదని పేర్కొన్నారు. ఇక్కడ వాహనం కిస్తీ చెల్లించడం కాకుండా మరేం చేశాడో ఈటల చెప్పాలని, ఇంకేం చేసినా తడిబట్టలతో మసీద్‌లో ప్రమాణం చేసేందుకు తాను సిద్ధమని ఎండీ జానీ ప్రకటించారు. ఈటలను వదిలి వచ్చిన తర్వాత ఇప్పుడు కోవర్టు అని అంటున్నారని, తనతో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదో చెప్పాలని రాపర్తి అఖిల్ డిమాండ్ చేశారు. ఇన్నేళ్ల ఉద్యమంలో తామేం చేశామో.. తమ పనేంటో ప్రజలకు తెలుసని, తెలిసీ, తెలియని నాయకుల ఆరోపణలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఉద్యమం పేరిట యువతను రెచ్చగొట్టి, వాడుకొని, వదిలేసి నాయకులెవరో ప్రజలకు తెలుసని, కోట్లు కూడబెట్టుకుని రాజకీయం చేయడం తగదన్నారు. ఇప్పటి వరకు తామేం సంపాదించుకున్నామో చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్లు కూడబెట్టుకున్నామా..? ఆస్తులను కాపాడుకునేందుకు పార్టీలు మారామా..? ఏం చేశామని తమపై ఆరోపణలు చేస్తున్నారో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను రెచ్చగొడితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పొన్నాల అనిల్, నల్లగోని శ్రీను, పిట్టల అనిల్, పోలు మధు, ఎరబాటి రమేశ్, వంశీ, చందు, వెంకటేశ్, మహ్మద్ పాషా, ముబారక్, షాబీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు



రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్19: కేంద్రం రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 23న హుజూరాబాద్ నిర్వహించనున్న రథయాత్ర కరపత్రాన్ని గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్ని పోరాటాలు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎంఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తునికి వసంత్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ రుద్రారపు రామచంద్రం, కోకన్వీనర్ మారేపల్లి శ్రీనివాస్, నాయకులు ఇంజం వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు దేవునూరి రవీందర్, ఎంఈఎఫ్ నాయకులు ఇల్లందుల సమ్మయ్య, కాల్వల మల్లయ్య, మట్టెడ ప్రకాశ్, ముక్కెర ముఖేష్, అంతడ్పుల సంపత్, నక్క లక్ష్మయ్య, రొంటాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తివిద్యా కోర్సులు ఉపాధి మార్గాలు

- ఐటీఐ కళాశాలల రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు
- జీఎస్‌ఆర్ ఐటీఐలో ఫ్రెషర్స్ డే




సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్‌ఆర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ముష్క వీరరాజు

జమ్మికుంట, అక్టోబర్ 19: వృత్తి విద్యా కోర్సులు ఉద్యోగ, ఉపాధికి మార్గాలని, ఐటీఐని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ కళాశాలల రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, కరీంనగర్ బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ కవిత, తెలంగాణ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ స్టేట్ సెక్రటరీ మిరుపాల గోపాల్‌రావు, చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఓల్డ్ ఆంప్స ఇంజినీర్స్ ఎండీ రాంచంద్రారెడ్డి, జీఎస్‌ఆర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ముష్క వీరరాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జీఎస్‌ఆర్ ఐటీఐలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని స్థానిక కాలేజీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటలు తోటి విద్యార్థులను అలరించాయి. అనంతరం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. ఐటీఐ ద్వారా వేల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, మరి కొందరు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఐటీఐలో ఫుల్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్, ల్యాబ్ సౌకర్యంతో కూడిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, కోర్సులను సకాలంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యను ఇక్కడ అందిస్తున్నారని, బోధన అవకాశాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అతిథులకు ఘనంగా సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభను చాటుతూ.. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. ఇక్కడ అధ్యాపకులు హరీశ్, రాజశ్రీ, మణిదీప్, సతీశ్‌కుమార్, రంజిత్, సాగర్, మధూకర్, రమేశ్, అంజిబాబు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

## వైభవంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ యూత్ నాయకులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 19: పట్టణంలోని శివ రామాలయం వద్ద దేవీ నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో గురువారం కాట్రపల్లి విశ్వనాథ్‌శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ హోమంలో బీఆర్‌ఎస్ యూత్ పట్టణాధ్యక్షుడు గందె సాయిచరణ్- మౌనిక దంపతులు, నాయకులు పంజాల మురళిగౌడ్- కృష్ణవేణి దంపతులు పాల్గొన్నారు. హోమం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, శివ రామాలయ దేవాలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు

ఇల్లందకుంట, అక్టోబర్ 19: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఇల్లందకుంట, శ్రీరాంలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వంతడుపు శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ సర్పంచ్ మొగిలి, ఉప సర్పంచ్ రవికుమార్, కమిటీ సభ్యులు వీరన్న, రవి, కౌశిక్, రాంస్వరణ్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## కనుల పండువగా శాకంబరీ ఉత్సవాలు



శాకంబరీ అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ

హుజూరాబాద్‌టౌన్,అక్టోబర్19: హుజూరాబాద్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం, సంతోషిమాత, అయ్యప్పస్వామి ఆలయాల్లో గురువారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరీ, సంతోషిమాత అమ్మవార్లను భక్తులు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయల ప్రసాదాన్ని శుక్రవారం ఉదయం భక్తులకు ప్రసాదంగా అందజేస్తామని ఆలయ పూజారులు, ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

## స్వాతంత్ర్య సమరయోధుడి మృతి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 19: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎదులపురం నారాయణ (96) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో మంచం పట్టారని గ్రామస్తులు తెలిపారు. ఆయన భార్య రెండేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారికి కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.